క్లుప్తంగా

హారికకు పరామర్శ



హారికను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కాళ్ల: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు పరామర్శించారు. అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ బీసీ సెల్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొండేటి శివకుమార్ గౌడ్ , రాష్ట్ర ఆర్టీఐ కార్యదర్శి బదుగు బాలాజీ, ఉండి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పాలా లక్ష్మీ చక్రధర్, పాలకోడేరు మండల కన్వీనర్ చెల్లబోయిన పాపారావు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పీహెచ్‌సీ వైద్యుడు రంగంనాయుడికి సత్కారం



రంగంనాయుడిని సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాళ్ల: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందుకున్న కాళ్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్. రంగంనాయుడును సోమవారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సత్కరించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ రంగంనాయుడు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.ఎస్.సునీల్, డా.డి.సునీత, డా.టి.భావన, సీహెచ్‌ఓ ఎన్.నాగమణి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెండి సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి దేవి మకర పీఠానికి సోమవారం దాతలు 100 గ్రాముల వెండి విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన జవ్వాది విజయ సాయి సత్యనారాయణ, శ్రీదుర్గ దంపతులు 100 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు.

మైపలో యూపీఏ సమావేశం

పాలకోడేరు: మైప గ్రామ పరిధిలోని వడ్డిగూడెంలో సోమవారం యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం దైవ సేవకులు వై.జార్జ్ ముల్లర్ అధ్యక్షతన జరిగింది. దైవ సేవకులు వాక్యోపదేశం, ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరు శాంతి మార్గాన్ని అనుసరించి ప్రేమ స్వభావాన్ని కలిగి ఉండాలన్నారు. ట్రెజరర్ ఏ దానియేల్, సెక్రటరీ ఏ. ఆసాపురాజు, ప్రెసిడెంట్ జి సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం వాయిదా

పాలకోడేరు: ఉండి జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 24న నిర్వహించ తలపెట్టిన దివ్యాంగుల కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఎప్పుడూ నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

విద్యుత్ స్తంభానికి కట్టి కొట్టారని ఫిర్యాదు

భీమవరం(ప్రకాశం చౌక్): తనను విద్యుత్ స్తంభానికి కట్టి కొట్టారని గణేష్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదుపై భీమవరం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు కృష్ణా జిల్లా చినగొల్లవానిపాలెం గ్రామానికి చెందిన తిరుమాని గణేష్ ఆదివారం భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వారిని చూడడానికి తన స్నేహితుడుతో కలిసి వచ్చాడు. తిరిగి రాత్రి 10.30 గంటలకు తిరిగి వెళ్తున్న సమయంలో గతంలో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన బీసీ కాలనీకి చెందిన అమ్మాయి తన ఇంటికి రమ్మని మెసేజ్ పెట్టడంతో అక్కడకు వెళ్లగా కొందరు విద్యుత్ స్తంభానికి కట్టి కొట్టి గాయపర్చారని గణేష్ ఫిర్యాదు చేశాడు.

23న నరసాపురంలో మెగా జాబ్‌మేళా

భీమవరం (ప్రకాశంచౌక్): జులై 23వ తేదీన నరసాపురం శ్రీ వైఎన్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ చే జూలై 23వ తేదీన నరసాపురం వైఎన్ కళాశాలలో హెచ్‌ఆర్‌డి సెంటర్ యందు నిర్వహించే జాబ్‌మేళాలో నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన పురుషులు, మహిళా అభ్యర్థులు అర్హులు అన్నారు. కంపెనీల యొక్క నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశము సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరములకు ఈ క్రింది నెంబర్లను 94508 38388, 95020 24765, సంప్రదించాలని తెలిపారు.

ఉక్కిరిబిక్కిరి వాతావరణంతో విలవిల

- 20 రోజులుగా భీష్మించిన వరుణుడు
- కరువు మండలాల్ని తలపిస్తున్న గ్రామాలు
- ఆక్వాకూ ఆక్సిజన్ గండమే
- ఎండలకు అల్లాడుతున్న ప్రజలు



తుంపర్లతో తడిపొడిగా తడిసిన రోడ్డు



నెమ్మదిగా సాగుతున్న దమ్ము పనులు

ఆకివీడు: పచ్చని డెల్టా ప్రాంతంలోని ఉండి నియోజకవర్గంలోని మండలాలు కరువు మండలాల్ని తలపిస్తున్నాయి. గత నెలన్నర రోజులుగా కనీస వర్షపాతం నమోదు కాకపోవడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. గత 20 రోజులుగా నియోజకవర్గంలో చినుకు పడితే ఒట్టు అన్న చందంగా ఉంది. ఆకాశం మేఘావృత్తమైనా, ఉరుములు, మెరుపులతో దద్దరిల్లినా వరుణ దేవుడు మాత్రం కరుణించడంలేదు. తుపాను, భారీ వర్ష సూచనల్ని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ వానజాడ కానరావడం లేదు. కనీస వర్షపాతం సైతం నమోదుకాని పరిస్థితి. నియోజకవర్గంలో అత్యధికంగా జూలై ఒకటవ తేదీన మాత్రమే నాలుగు మండలాల్లో వర్షం కురిసింది. ఉండిలో 9 మి.మీ., కాళ్లలో 14.2 మి.మీ., ఆకివీడులో 8.2 మి.మీ., పాలకోడేరులో 7.0 మి.మీటర్లు వర్షపాతం నమోదు కాగా నెలలో మొత్తం నాలుగు మండలాల్లో ఐదు రోజులు మాత్రమే వర్షం కురిసింది. మిగిలిన రోజుల్లో తీవ్ర ఉష్ణోగ్రతతో ప్రజలు అల్లాడిపోయారు.

సాగని ఖరీఫ్ పనులు

వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ పనులు ముందుకు సాగడంలేదు. మండుటెండలతో దమ్ము పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. పలు చోట్ల నారుమడులు వేసినప్పటికీ నారు ఎదుగుదలకు, దమ్ము పనులకు పంట కాల్వల నీరు అందడంలేదు. దీంతో కొన్ని మండలాల్లోని నారుమడులు బీటలు వారుతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సాగు ఇబ్బందికరంగా ఉందని రైతులు వాపోతున్నారు.

ఆక్వాకూ నష్టమే

వాతావరణ ప్రభావంతో ఆక్వా రంగం అతలాకుతలమవుతోంది. చేపల చెరువుల్లోనూ, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ అందక చేపలు, రొయ్యలు వైరస్ బారిన పడుతుండడతో రైతులు భారీ నష్టాల్ని చవిచూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు రొయ్యల సాగుకు అనుకూలమైన వాతావరణం లేదని చెరువుల్లో చేప పిల్లల్ని, ఇతర చేపల్ని పెంచుతున్నారు.

అల్లాడుతున్న ప్రజాజీవనం

వర్షాకాలంలో వేసవిని తలపించే విధంగా ఎండలు కాస్తుండడంతో వేడిని తట్టుకోలేక ప్రజలు అల్లాడుతున్నారు. ఈనెలలో అత్యధికంగా 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి. రాత్రుళ్లు ఉక్కబోతను తట్టుకోలేక అధిక శాతం ప్రజలు ఏసీలకు అతుక్కుపోతున్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భావితరాలకు బంగారు భవిష్యత్ అందించాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ అన్నారు. భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ జిల్లా సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల ఇది సాధ్యం కాదని, స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా నడుం బిగించాలని, ప్లాస్టిక్ అంతానికి ఈరోజే ముందడుగు వేయాలని తెలిపారు. అనంతరం ప్రయాణికులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



రాయకుదురులో అమ్మవార్లకు సారె తీసుకువస్తున్న మహిళలు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామి వారికి ఆషాడమాస జాతర సందర్భంగా సోమవారం రాయకుదురు లలిత కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆషాఢమాసం సారెను అమ్మవార్లకు సమర్పించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఉమామలేశ్వరస్వామి ఆలయంలో భారీ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్కడమిల్లి సుబ్బయ్య గుప్తా, అడ్డాల ఏడుకొండలు, ఆలయం కమిటీ సభ్యులు, లలిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేకే



చినకృష్ణమూర్తి

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కూటమి నేతలు అక్రమ అరెస్టులకు తెరతీశారని యండగండి సర్పంచ్, వైఎస్సార్ సీపీ మేధావి విభాగం నియోజకవర్గ కన్వీనర్ గోగులమండ చినకృష్ణమూర్తి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఆయన ఖండించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు జమిలీ ఎన్నికలు వస్తే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇది తెలసిన కూటమి నేతలు జగన్‌మోహన్‌రెడ్డిని అణచివేయాలనే ఉద్దేశంతో అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో ఎన్ని కుట్రలు చేసినా కూటమి నాయకుల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. ప్రజలకు ఎవరు మంచిచేస్తారో వారు అర్థం చేసుకున్నారు కాబట్టే జగన్‌మోహన్‌రెడ్డి సభలకు ప్రజలు స్వచ్ఛందంగా పోటెత్తి వస్తున్నారని అన్నారు. అదే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సభలకు ఎంతమంది వస్తున్నారో గమనిస్తే అర్థం అవుతుందన్నారు. వారిద్దరూ ఎన్ని జన్మలెత్తినా జగన్ మోహన్‌రెడ్డిలా ప్రజాభిమానాన్ని సంపాదించడం వారి వల్ల కాదని, ఇకనైనా అక్రమ అరెస్టులు మానుకోకపోతే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ధర్మాపురం బాధితులకు న్యాయం చేయాలి



ధర్మాపుర అగ్రహారంలో బాధితుల్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని దళిత పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల కూల్చివేసిన ప్రాంతాల్ని సోమవారం నాయకులు సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ పోలీసులు, నగర పంచాయతీ, రెవెన్యూ అధికారులు కనికరం లేని విధంగా ప్రవర్తించి ఆక్రమణలు తొలగించారన్నారు. మంచినీటి చెరువుకు దూరంగా ఉన్న భవనాల్ని కూడా కూల్చివేయడం దారుణమన్నారు. ప్రభుత్వమే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీ.ధనరాజు, సీహెచ్.చిట్టిబాబు, గాలి సామ్రాజ్యం, జామి శ్రీనివాస్, తోట శివాజీ, కుర్రెళ్ల పోలు, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దిరుసుమర్రు హాస్టల్‌లోని వంట గదిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం అకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థినులకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి? ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా ! మీరు ఎక్కడ నుంచి వచ్చారు అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సన్నబియ్యంతో, మెనూ ప్రకారం కూరలు పెడుతున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థినులు పడుకుంటున్న గదులను, పరిసరాలను పరిశీలించారు. వంట షెడ్డులోని తయారు చేసిన వంటను, కూరలను స్వయంగా పరిశీలించారు. ఆహార పధార్థాలను తయారు చేసి పిల్లలకు పెట్టే విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని, ప్రతి రోజు మెనూ ప్రకారం వంటలను శుభ్రంగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, హాస్టల్ వార్డెన్ ఏ దేవి, వీఆర్‌వో తదితరులు ఉన్నారు.

బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కమిటీ

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికల సోమవారం జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా కలిదిండి వినోద్ వర్మ, జిల్లా అధ్యక్షుడిగా కతారి రవి శంకర్, కార్యదర్శి వలవల ఫణి కుమార్, వైస్ ప్రెసిడెంట్ వాడపల్లి శ్రీనివాస్‌రాజులను ఎన్నుకున్నారు. కన్వీనర్ కొప్పురావూరి షణ్ముక్ కుమార్, ట్రెజరర్ మద్దు వాసు, జాయింట్ సెక్రటరీ ముత్యాల గణపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేతల ప్రకాష్, జర్జిస్ కమిటీ చైర్మన్ పత్తి సురేష్, కమిటీ ప్రెసిడెంట్ సంగవరపు గోవర్ధన్ కుమార్, కార్యదర్శి రెడ్డి రవిరాజా, కాంపిటీషన్ సెక్రటరీ గవర అనిల్, కో ఆర్డినేటర్ కమిటీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఈసీ మెంబర్స్ మరం రాధాకృష్ణ, యార్ల ఉపేంద్ర, ఆకుల సురేషలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా రానున్న రోజుల్లో ఏడాదిలో నాలుగు జోనల్ స్థాయి పోటీలను, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు తెలిపారు. కుమారులు సక్రమంగా చూడటంలేదని రాజామణి, సరిహద్దుదారుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గంగానమ్మకోడు ప్రాంతంలోని తెలగపాముల గృహనివాసి మేకల తిమోతి ఫిర్యాదు చేశారన్నారు. చినకాపవరం డ్రైయిన్ ప్రాంతం ఉప్పుటేరు పడమరవైపు గట్టు ప్రాంతంలో ఆక్రమణ చేసి చేపల చెరువు తవ్వారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల పనితీరుపై వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలు చేయాలని రామిరెడ్డి అర్జీ అందజేశారు. సిద్ధాపురం గ్రామంలోని పంట కాల్వకు చేర్చి అనుమతి లేని రొయ్యల చెరువులకు బోర్లు తవ్వుతున్నారని, తమ గ్రామంలోని మంచినీటి చెరువుకు కలుషిత నీరు వచ్చే ప్రమాదం ఉందని మాజీ సర్పంచ్ తోట శివాజీ ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు.

వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి



దిరుసుమర్రులో వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

భీమవరం అర్బన్: మండలంలో సార్వా వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో సోమవారం మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ నారుమడులను, వరినాట్లను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. వరినాట్లను ఇప్పుడు ఆలస్యం చేస్తే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసే భారీ వర్షాలకు, తుఫాన్‌లకు పంట దెబ్బతింటుందన్నారు. ముందుగా రైతులు వరినాట్లను పూర్తి చేయాలన్నారు. ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలు వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల వరిపైరుకు గాలి తగలడమే కాకుండా తెగులు ఆశించదన్నారు. మందులు, ఎరువులు పిచికారి చేసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు.

కేఎస్‌ఎమ్ 12368 వంగడం సార్వా అనుకూలం

దిరుసుమర్రులో కేఎస్‌ఎమ్ 12368 వంగడం సాగు చేస్తున్న అల్లూరి ప్రసాద్ రాజు పొలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కేఎస్‌ఎమ్ 12368 వంగడం ఎకరానికి 58 బస్తాలు (75 కేజీలు బస్తా) దిగుబడిని ఇస్తుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎక్కువగా పండిస్తున్నారని తెలిపారు. ఈ విత్తనాన్ని బీపీటీ 5204 (సాంబమసూరి) నుంచి అభివృద్ధి చేశారన్నారు. సన్నని ధాన్యం గల వరి అని ఒక్కొక్క కంకికి 400–450 గింజలు ఉంటాయన్నారు. ఈ పంట ఖరీఫ్, రబీ పంటలలో సాగు చేసుకోవచ్చన్నారు. ఈ పంట 125 –140 రోజులకు పంట పక్వానికి వస్తుందన్నారు.ఎకరానికి 20–25 విత్తనాలు అవసరమవుతాయని సూచించారు.

జిల్లాలో మార్గదర్శకుల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పి4 లో భాగంగా మార్గదర్శకుల నమోదు, బంగారు కుటుంబాల అనుసంధానం అంశంపై సోమవారం జిల్లా కలెక్టరేట్ చదలవాడ నాగరాణి పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా, సామజికంగా బలోపేతం చేసేందుకు పి4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, సీపీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కేసిహెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్యాయంగా కొట్టాడని వ్యక్తిపై ఫిర్యాదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అన్యాయంగా కొట్టి గాయపరిచారని ఒక వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. దిరుసుమర్రులోని క్రిస్టియన్ పేటకు చెందిన కేతా శ్రీనివాస్ వీధిలో అదే గ్రామానికి చెందిన ముప్పల పాలరాజు ద్విచక్రవాహనం అడ్డుగా పెట్టాడని ఎందుకు పెట్టావని అడగగా గొడవ పెట్టి మరో వ్యక్తితో దాడి చేశాడని కేతా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటర్ దాఖలు

క్రిస్టియన్ పేటకు చెందిన కేతా శ్రీనివాస్ అన్యాయంగా కొట్టి గాయపరిచారని ముప్పల పాలరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వ్యవసాయ ఆధారిత భూములలో ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా »పచ్చిరొట్ట పైర్లకు వాడడం ద్వారా చేకూరే ప్రయోజనాలపై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అధిక ఎరువులు వినియోగం కారణంగా భూసారం దెబ్బతిని జీవం కోల్పోవడంతో భూమి సాగుకు పనికి రాకుండా పోతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందన్నారు. వర్షాకాలానికి ముందు పాడి విత్తనాలను వెదజల్లడం ద్వారా పచ్చి రొట్టి ఎరువులు పొందవచ్చు అన్నారు. నేలసారం పెంపు, ఆరోగ్యకరమైన నేల, పోషకాలు వృథా తగ్గుతుందన్నారు. సాగు ఖర్చులు తగ్గిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కేసిహెచ్ అప్పారావు ఉన్నారు.

మిథున్‌రెడ్డిపై కేసులు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్

భీమవరం అర్బన్: ఎంపీ మిథున్‌రెడ్డిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసి జైలుకి పంపడం అన్యాయమని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ ఖండించారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో సోమవారం దళిత ఐక్య వేదిక మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ మిథున్‌రెడ్డిపై కేసులు కోర్టులో వీగిపోవడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో అంబటి ఆనంద్‌కుమార్, ఎమ్. మోజేష్, టి. రాజు, జి. జార్జ్, పి. జాన్ బాబు, కె.లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి



భీమవరంలో నార్కోటిక్స్, డ్రగ్స్ అవగాహనపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్యవంతమైన సమాజానికి ఔషధ నిపుణులు భాగస్వామ్యం కావాలని పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం జోన్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాంటీబయాటిక్స్, నార్కోటిక్స్, డ్రగ్స్ అవగాహనా సదస్సును సోమవారం భీమవరం ఆనంద్ ఇన్ నందు సోమవారం నిర్వహించారు. ముందుగా ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం నుంచి ఆనంద ఇన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆనంద్ ఇన్ నందు నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ లైసెన్సింగ్ అథారిటీ (ఏలూరు) డి.బి.ఎం.కే చక్రవర్తి, జిల్లా ఔషధ నియంత్రణా అధికారి, భీమవరం డ్రగ్ ఇన్స్‌పెక్టర్ అబిద్ అలీ షేక్ డాక్టర్ సందీప్ వర్మ, 10 మండలాలకు చెందిన మెడికల్ షాపుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక ఏకగ్రీవం

ఆకివీడు సీబీసీఎన్‌సీ ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని చర్చి ఆవరణలో సోమవారం ఫీల్డ్ కౌన్సిల్‌లోని 12 సంఘాలకు గాను 10 సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఉంగుటూరు మండలం ఎంఎం పురం గ్రామానికి చెందిన కురెళ్ల రవి ప్రకాష్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జీ.జోసఫ్ రాజు, కోశాధికారిగా జీ.సుందర్ సింగ్, కన్వీనర్‌గా సదర్ల జక్కరయ్య ఎన్నికయ్యారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని అధ్యక్షుడు రవి ప్రకాష్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి, సంఘాల్ని పునర్నిర్మించాలని కోరారు. సమావేశంలో ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి జోసఫ్ రాజు మాట్లాడుతూ కొత్త సంఘం రెండేళ్ల పాటు కొనసాగుతోందన్నారు. సమావేశంలో సిద్ధాపురం, పెదకాపవరం, ఎంఎం.పురం, చెట్టున్నపాడు, హోప్ చర్చి, యునైటెడ్ చర్చి, కాళ్లకూరు, చెరుకువాడ, సెంట్రల్ చర్చి, బావాయిపాలెం చర్చి కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారని చెప్పారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం సూరిబాబు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో డిస్కం అధ్యక్షులు జే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో ప్రజలకి భారాలు వేసే విధంగా పాలకుల విధానాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. ఉద్యోగుల మీద విపరీతమైన పని భారం పెరుగుతుందని. ఎప్పుడు లేని విధంగా గత ప్రభుత్వం ఇచ్చిన పీఆర్సీ వలన విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ఈ సమావేశంలో విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజుఫర్ అహ్మద్, సిఐటీయూ జిల్లా కార్యదర్శి రాయ్, విద్యుత్ ఉద్యోగులు నాయకులు సురేష్, పాండురంగరాజు, జోసఫ్ రాజు, బోస్, దత్తు, శ్రీనివాసరాజు, జానకి రామ్ తదితరులు పాల్గొన్నారు.